# సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024






## బొమ్మె చేపలు C/O హాజీపూర్

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద బొమ్మె చేపల పెంపకం కేంద్రం ఏర్పాటు కానుంది. 30 ఎకరాల్లో రూ.15కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించినట్లు తెలుస్తోంది. 8లో▸



## నేలలోని పోషకాలు కాపాడుకోవాలి

నేలలో అంతర్లీనంగా ఉన్న పోషకాలను కాపాడుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. 9లో▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పశ్చిమ నైరుతి దిశగా ఈదురుగాలులు వీస్తాయి. చలి తీవ్రత ఉంటుంది.

## న్యూస్‌రీల్

### లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: ఈ నెల 14న మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజీకి వచ్చే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకునేలా న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులతో మాట్లాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

### మండలంలో పులి సంచారం!



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

భీమిని: మండలంలోని చెన్నపూర్ గ్రామ శివారులో పులి కనిపించడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. గురువారం గ్రామ సమీపంలోని మిర్చి పంటకు రైతులు టాకిరే బాపురావు, గోపాల్ నీరు పారించడానికి వెళ్లారు. పులిగాండ్రింపులు చేస్తూ కనిపించడంతో ఒక్కసారిగా గుండె ఆగినంత పనైందని, వెంటనే శబ్దం చేయకుండా స్థానికంగా ఉన్న చెట్టు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నామని వారు తెలిపారు. పులి అక్కడి నుంచి వెళ్లగానే గ్రామానికి వచ్చి జరిగిన విషయాన్ని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. చీకటి పడడంతో సంఘటన స్థలానికి వెళ్లలేదు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి సువర్ణ గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

### సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సింగరేణి సీఎండీ యన్.బలరాం అన్నారు. బుధవారం రాత్రి షిఫ్ట్‌లో ఆయన ఎస్ఆర్పీ 3 గనిని ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగులను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో పని చేయాలని, నిర్దేశించిన విధుల సమయం 8గంటలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించినప్పుడే లాభాలు గడిస్తామని అన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కోఆర్డినేషన్ సుభాని, శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

### రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు రూ.10.80 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 673 మంది రైతుల నుంచి 11,635 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 13 రైస్‌మిల్లులకు సీఎంఆర్ అనుమతులు జారీ చేశామని పేర్కొన్నారు.

### బీజేపీ నాయకుల రాస్తారోకో




రాస్తారోకోలో బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు నెరవేర్చడం లేదని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రైతుగోస పేరిట స్థానిక ఎస్సార్ ఫంక్షన్ హాలు వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. రాస్తారోకో నిర్వహణకు అంబేడ్కర్ చౌరస్తా వద్దకు వెళ్తున్న నాయకులను పోలీసులు ఫంక్షన్ హాల్ వద్ద అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించారు. ఏసీపీ ప్రకాష్, పోలీసులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌తోపాటు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తం, శ్రీనివాస్, క్రిష్ణమూర్తి, రమణరావు, రాజన్న, హరిగోపాల్, శ్రీదేవి, ప్రభాకర్, గురువయ్య, తిరుపతి పాల్గొన్నారు.

# ఏడాదిలోనే హామీల అమలు!

interview

- నియోజకవర్గంలో చేసి చూపించాం
- విద్య, వైద్యం, సాగునీటికి ఢోకా ఉండదు
- జిల్లా కేంద్రం కార్పొరేషన్‌గా మార్పు
- వచ్చే 50ఏళ్లకు అనుగుణంగా అభివృద్ధి
- 'సాక్షి'తో మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గెలిచిన ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. విద్యా, వైద్యం స్థానికంగానే సేవలు అందేలా స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. మంచిర్యాల నియోజకవర్గ చరిత్రలో ఎవరూ చేయని పనులు తాము చేసి చూపిస్తున్నామని వివరించారు. తాగు, సాగునీరు, ఉపాధి కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. నస్పూర్‌లో సింగరేణి ఇళ్ల పట్టాల సమస్య కూడా త్వరలోనే తీర్చుతామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పిదాలు మళ్లీ చేయకుండా వచ్చే 50ఏళ్లను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ అభివృద్ధిని నిర్మిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేగా ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### విద్య, వైద్యం కోసం వెళ్లొద్దు

ఇక్కడి నుంచి ఎవరూ విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లొద్దు. అందుకే స్థానికంగానే విద్యా, వైద్య సేవలు అందేలా ఏర్పాటు చేస్తున్నాం. దండేపల్లిలో 25ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటవుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం. మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలోనే 650 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ, మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మిస్తున్నాం.

### సాగునీరు, ఉపాధి కల్పన

నియోజకవర్గంలో రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా దండేపల్లి పరిధిలో రెండు, లక్సెట్టిపేటలో ఒకటి చొప్పున మూడు లిఫ్టులు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో కటింగ్ లేకుండా చేశాం. హాజీపూర్ మండలం వేంపల్లి శివార్లలో ఇండస్ట్రియల్ పార్కుతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం, స్థానికులకు ఉపాధి కలుగుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో ఏర్పాటు చేయబోతున్న ఫిష్ పాండ్ దేశంలోనే మొదటిది. ఇక్కడ నుంచి చేపల ఎగుమతి మొదలైతే స్థానికులకు ఉపాధికి వీలు ఉంటుంది.

వచ్చే రెండేళ్లలోనే ఈ సేవలు అందేలా చూస్తాం.

### ట్యాంకర్లు లేకుండా నీటి సరఫరా

మంచిర్యాలలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేసే పరిస్థితి లేకుండా చేశాం. ప్రతిరోజూ ఇంటింటికి తాగునీరు అందుతోంది. గోదావరిపై గత సర్కారు మంజూరు చేసిన వంతెన ప్రస్తుత రద్దీకి సరిపోదు. పట్టణంలో భారీ వాహనాలతో ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే ఆ వంతెనను వేరే చోటుకు మార్చాం. గోదావరి ఒడ్డునే మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మించి నష్టం చేశారు. ఐబీ ఆవరణలో వెజ్, నాన్‌వెజ్ కలిపి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కట్టాలనుకున్నారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఎక్కడా సక్సెస్ కాలేదు. అందరికీ అందుబాటులో ఉండాలనే అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నాం. వరదలు రాకుండా కరకట్ట నిర్మిస్తున్నాం. పట్టణాన్ని పునర్నిర్మాణం చేసే క్రమంలోనే మార్కెట్‌లో రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నాం. ఎవరినీ ఇబ్బంది పెట్టి కూల్చడం లేదు. అందరితో చర్చించి, ఆమోదంతోనే జరుగుతున్నాయి. ఈ ఆక్రమణలు ఆపకపోతే భవిష్యత్‌లో మార్కెట్ కనుమరుగవుతుంది. రెండు, మూడు నెలల్లో మంచిర్యాలను కార్పొరేషన్‌గా మార్చబోతున్నాం.

### మంత్రి పదవి అధిష్టానం నిర్ణయం

మంత్రి పదవిపై నేనేమి మాట్లాడను. అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. ఎమ్మెల్యేగా నా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తా. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తా. నియోజకవర్గంలో గత ఏడాదిగా జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారు. అనవసరమైన విమర్శలు పట్టించుకోను.

# 'అదనపు' సౌకర్యం

- రైలు ప్రయాణికులకు ఊరట
- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రెండేసి కొత్త కోచ్‌లు



బెల్లంపల్లి రైల్వేస్టేషన్

బెల్లంపల్లి: ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ బోగీ(కోచ్)ల సంఖ్య పెంచుతూ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం ప్రయాణికులకు ఊరటనిస్తోంది. ఇప్పటివరకు రెండేసి సాధారణ బోగీలు మాత్రమే ఉండగా.. రైళ్లలో ప్రయాణం నిరుపేదలకు కష్టతరంగా మారింది. ఒక్కోసారి వందల కిలోమీటర్లు నిల్చుని ప్రయాణం చేయడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ ఇబ్బందులు దూరమయ్యేలా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 19ఎక్స్‌ప్రెస్ రైళ్లకు 66 ఎల్‌బీహెచ్ కోచ్‌లను జత చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కొత్తగా జత చేసిన అదనపు కోచ్‌ల వల్ల ప్రయాణికులకు తిప్పలు కొంతవరకు తప్పనున్నాయి.

### సికింద్రాబాద్–న్యూఢిల్లీ మార్గంలో..

కాజీపేట రైల్వేజంక్షన్ మీదుగా సికింద్రాబాద్–న్యూఢిల్లీ మార్గంలో రాకపోకలు సాగించే మూడు ప్రధాన రైళ్లకు ఎల్‌బీహెచ్ కోచ్‌లను జత చేయనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. హైదరాబాద్–నిజాముద్దీన్–హైదరాబాద్, సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–దానాపూర్–సికింద్రాబాద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు కొత్త కోచ్‌లు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్–నిజాముద్దీన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయగా.. మరో రెండు రైళ్లకు ఒకట్రెండు రోజుల్లో బిగించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగు చేరనుంది. గరిష్ఠంగా వంద సీట్ల సామర్థ్యంతో ఒక్కో ఎల్‌బీహెచ్ కోచ్‌ను తయారు చేసినట్లు సమాచారం. రెండేసి కోచ్‌లను బిగించడం వల్ల ఒక్కో రైల్లో అదనంగా 200 సీట్లు పెరగనున్నాయి. దీంతో మరింత ఎక్కువ మంది ప్రయాణానికి అవకాశాలు ఉన్నాయి.

### ప్రజలకు ప్రయోజనకరం

కొత్తగా ఏర్పాటు చేయనున్న బోగీల వల్ల సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీ మార్గంలో ప్రయాణించే వారితోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనం కలుగనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగనున్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి రోజువారీగా వందలాది మంది కూలీలు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాపార, వాణిజ్య వర్గాలతోపాటు ఉద్యోగులు, రోగులు, విద్యార్థులు ప్రయాణం సౌకర్యవంతంగా మారనుంది.

### పేదలకు ఉపయోగం



ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ కోచ్‌ల సంఖ్య పెంచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. పేదలు ప్రయాణించే జనరల్ కోచ్‌లు పెంచకపోవడంతో రాకపోకలకు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాజాగా రైల్వే శాఖ రెండేసి జనరల్ కోచ్‌లు బిగిస్తామని ప్రకటించడం శుభ పరిణామం. తద్వారా పేద ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. మిగతా రైళ్లలోనూ అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చాలి. – జాగటి శ్రీనివాస్, బెల్లంపల్లి

# ఆపరేషన్ ఆమెకే..!




శస్త్రచికిత్సల పక్షోత్సవం పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్(ఫైల్)

- కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సకు పురుషుల వెనుకంజ
- అవగాహన కల్పిస్తున్నా ముందుకొస్తున్నది కొందరే..
- జిల్లాలో ముగిసిన వ్యాసెక్టమీ శస్త్రచికిత్సల పక్షోత్సవం

మంచిర్యాలటౌన్: కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స భారం మహిళలపైనే పడుతోంది. పురుషులు ఆపరేషన్‌కు ముందుకు రాకపోవడంతో మహిళలే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. నవ మాసాలు మోసి.. పురిటినొప్పులు భరించి ఆపరేషన్ ద్వారా పిల్లలకు జన్మనిస్తుండగా.. సంతానం కలుగకుండా ఉండేందుకు మరోసారి శస్త్రచికిత్స తప్పడం లేదు. పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్(వ్యాసెక్టమీ) చేయించుకుంటే ఐదు నిమిషాల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. కానీ మహిళలకు ఆపరేషన్(ట్యూబెక్టమీ) చేయించేందుకే పురుషులు ముందుకు వస్తున్నారు. పురుషులు శస్త్రచికిత్స చేయించుకునేలా ప్రతియేటా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ముందుకు వస్తున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. జిల్లాలో మహిళలతో పోలిస్తే పురుషుల సంఖ్య నాలుగేళ్లలో ఏ ఏడాదీ వందకు చేరలేదు.

### కోత, కుట్టు లేకుండా..

కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురుషులకు చేసే వ్యాసెక్టమీ శస్త్రచికిత్స చాలా సులభం. కోత, కుట్టు లేని శస్త్రచికిత్స ఇది. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పూర్తయ్యే ఈ విధానంలో రక్తస్రావం ఉండదు. శస్త్రచికిత్స అయిన వెంటనే చిన్న చిన్న పనులు నిరభ్యంతరంగా చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. రెండు మూడు రోజుల్లోనే పనులు చేసుకునే అవకాశం ఉండగా.. వారికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవు. పురుషులకు గతంలో శస్త్రచికిత్స చేయాలంటే తప్పనిసరిగా కోత పెట్టాల్సి వచ్చేది. ఆధునిక విధానమైన నో స్కాల్‌పల్ వేసెక్టమీ(ఎన్ఎస్వీ) అందుబాటులోకి రావడంతోపాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలోనూ నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో చేసే ఆపరేషన్‌కు పురుషులు కొంతసేపు విశ్రాంతి తర్వాత ఇంటికి వెళ్లే అవకాశం ఉంది. మహిళలు ట్యూబెక్టమీ చేయించుకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. శస్త్రచికిత్స సమయంలో కడుపు కోత పెట్టాల్సి ఉండడంతో రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. కుట్లు మానడానికి సమయం పడుతుంది. అప్పటికే ఒకట్రెండు కాన్పులు శస్త్రచికిత్స ద్వారా జరిగిన మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.

### వ్యాసెక్టమీపైనే దృష్టి

కు.ని శస్త్రచికిత్స విషయంలో పురుషులు, స్త్రీల మధ్య తారతమ్యం మారడం లేదు. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు చేయించుకునే అవకాశం ఉన్నా మహిళలకే పరిమితం చేస్తుండడం సమాజంలో మూఢాచారానికి అద్దం పడుతోంది. పురుషులు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనే అపోహ ఇంకా నెలకొంది. ట్యూబెక్టమీ ఆపరేషన్లు వేలల్లో జరుగుతుంటే వ్యాసెక్టమీ ఆపరేషన్లు పదుల సంఖ్యకే పరిమితం అవుతున్నాయి. గత నెల 21 నుంచి ఈ నెల 4వరకు జిల్లాలో వ్యాసెక్టమీ మాత్రమే చేయించేలా పురుషుల్లో కల్పిస్తున్న అవగాహనతో కు.ని పక్షోత్సవాల్లో 86 మంది వేసెక్టమీ చేయించడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కొంతవరకు విజయం సాధించింది. ఇలాగే కొనసాగితే పురుషుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

### జిల్లాలో ఆపరేషన్ల వివరాలు

| సంవత్సరం | ట్యూబెక్టమీ | వ్యాసెక్టమీ |
|---|---|---|
| 2016–17 | 2,909 | 61 |
| 2017–18 | 3,402 | 57 |
| 2018–19 | 2,619 | 177 |
| 2019–20 | 2,156 | 128 |
| 2020–21 | 2,655 | 204 |
| 2021–22 | 760 | 82 |
| 2022–23 | 2,423 | 37 |
| 2023–24 | 2,588 | 37 |
| 2024–25 | 1404 | 86(ఈ నెల 4వరకు) |

### పురుషులకు సులభం



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మహిళలకే కాదని, పురుషులు కూడా చేసుకోవాలని జిల్లా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇటీవల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పురుషులకు వ్యాసెక్టమీ శస్త్రచికిత్స చేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశాం. మహిళల కంటే పురుషులకు చేసే కు.ని ఆపరేషన్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

# నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ

- మంచిర్యాల బస్టాండ్ విస్తరణకు కృషి
- ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు



ప్రయాణికురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ నష్టాల్లో నుంచి లాభాల బాట పట్టేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. గురువారం మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా ప్రజా ప్రభుత్వంలో సకల జనుల సంబురం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులు అమ్ముకునే స్థాయి నుంచి కూడబెట్టే స్థాయికి ఆర్టీసీ చేరిందంటే కాంగ్రెస్ ప్రభుత్వం చొరవేనని అన్నారు. మంచిర్యాల డిపో రూ.8కోట్ల లాభాలు ఆర్జించడం సంతోషంగా ఉందని, మహాలక్ష్మి పథకం అమలు అనంతరం 1,25,66,228 మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టేషన్ విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంపై కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. కార్మికులకు ఏవిధంగా లాభం జరుగుతుందో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, రవాణాశాఖ మంత్రితో చర్చించిన తర్వాతే నిర్ణయం ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల జీతాలు పెంచి లాభాల్లో వాటాకు ప్రయత్నం చేస్తానని అన్నారు. ప్రతీరోజు జైపూర్ నుంచి మంచిర్యాలకు బస్సుల్లో ప్రయాణించే మహిళను శాలువాలతో సన్మానించారు. మంచిర్యాల డిపో మేనేజర జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పింఛన్ ఆడిట్ బృందం పర్యవేక్షణ



ముల్కల్లలో ఆడిట్ బృందంతో ఎంపీడీఓ ప్రసాద్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర పింఛన్ ఆడిట్ బృందం గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పింఛన్‌దారులను ప్రత్యక్షంగా కలిసింది. ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్, దొనబండ గ్రామాల్లో వృద్ధ, వితంతు పింఛన్ లబ్ధిదారులను కలిసి ప్రతీ నెల పింఛన్ అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయానికి రాని వారికి కార్యదర్శులు ఇస్తున్న పింఛన్ అందుతుందా అని ఆరా తీశారు. పింఛన్ పొందడంలో ఇబ్బందులు తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. ఆడిట్ బృందం వెంట ఎంపీడీఓ ప్రసాద్, డీఆర్‌డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సదానందం, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సాయిరాం, నాగరాజు, నరేందర్, పోస్ట్‌మాస్టర్లు ఉన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చాం

- స్ట్రక్చర్ సమావేశంలో పలు ఒప్పందాలు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న వీ.సీతారామయ్య

శ్రీరాంపూర్: ఎన్నికల సమయంలో తాము కార్మికులకు ఇచ్చిన హామీల్లో కొన్నింటిని నెరవేర్చామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గురువారం ఆయన ఆర్కే–7 గనిలో కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్ మాట్లాడారు. ఇటీవల యాజమాన్యంతో జరిగిన 50వ స్ట్రక్చర్ సమావేశంలో పలు అంశాలపై అంగీకారం కుదిరిందని తెలిపారు. మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని కోరామని చెప్పారు. మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్లకు ఒప్పుకున్నారని, మిగతా వారి విషయంపై త్వరలో సీఎండీ సమక్షంలో జరిగే చర్చల్లో పరిష్కరిస్తామని చెప్పారని అన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొత్తపల్లిలో సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

జైపూర్: భీమారం మండలం కొత్తపల్లి, మద్దికల్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యాన్ని పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ఏమాత్రం జాప్యం చేయకుండా కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు. సన్నరకాలకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని, నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలను వెంటవెంటనే ట్యాబ్‌ల ద్వారా ఎంట్రీ చేయాలని సూచించారు. తహసీల్దార్ సదానందం పాల్గొన్నారు.

# 'సాగు' బడి



కూరగాయలు, బంతిపూల తోటలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



చిక్కుడు పంట



కొత్తిమీర మడి వద్ద ఉపాధ్యాయురాలు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి ప్రాథమిక పాఠశాలలో వివిధ రకాల కూరగాయలు పండిస్తూ మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అటు కూరగాయల సాగు, ఇటు పూల మొక్కలతో పాఠశాల ఆవరణ ఉద్యానవనంలా కనిపిస్తోంది. ప్రధానోపాధ్యాయుడు అంకతి తిరుపతి, ఉపాధ్యాయురాలు రాథోడ్ సంగీత విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన విరామ సమయాల్లో కూరగాయలు, పూలతోటల పెంపకం చేపట్టారు. బంతి, చామంతి, గులాబీ, మందారం, సీతమ్మజడ పూలు విరగపూశాయి. సోరకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, బెండకాయ, పాలకూర, కొత్తిమీర, మెంతికూర సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. రోజువారీగా మధ్యాహ్న భోజనం వంటల్లో వినియోగిస్తున్నారు. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణంతో ఉన్న 42మంది విద్యార్థులు ప్రతీరోజు హాజరవుతున్నారు. కూరగాయలు ఎలా పండించాలి, పంట చేతికొచ్చిన తర్వాత వాటిని వినియోగించడం తదితర విషయాలు ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. ఉపాధ్యాయులను ఎంఈఓ ఎస్.రాము అభినందించారు.

## క్లుప్తంగా

### సర్వీసు రోడ్డుపై లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

నేరడిగొండ(బోథ్): మండల కేంద్రంలోని సర్వీసు రోడ్డుపై గురువారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు పేపర్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో ఆ రోడ్డు గుండా నిర్మల్ నుంచి ఆదిలాబాద్, బోథ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి పైనుంచి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ తర్వాత యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

### రైతుపై అడవిపంది దాడి



ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రైతుపై అడవి పంది దాడిచేసిన ఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మడావి నాగోరావ్ గురువారం మధ్యాహ్నం మెండపల్లి శివారులోని తన చేనులో పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

### ఒకరికి దేహశుద్ధి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఒకరు గురువారం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న సదరు మహిళ కుటుంబ సభ్యులు అతనికి దేహశుద్ధి చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు.

### అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్/నిర్మల్‌రూరల్: బాలికపై అత్యాచారానికి యత్నించిన కేసులో ఒకరికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కర్ణకుమార్ గురువారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలంలోని డ్యంగాపూర్‌కు ఏల్పుల చంద్ అలియాస్ చంద్రశేఖర్ 2021 మార్చి 31న అదే గ్రామానికి చెందిన బాలిక(15)పై అత్యాచారానికి యత్నించాడు. సదరు బాలిక తప్పించుకుని వెళ్లి తల్లికి చెప్పగా నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సుమన్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ఉపేందర్ దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితునికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.



# బొమ్మె చేపలు C/O హాజీపూర్!

- సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద అంతర్జాతీయ స్థాయిలో కేంద్రం
- 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం




ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద బొమ్మె చేపల సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలం ఇదే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ ప్రాజెక్ట్‌కు మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేదిక కానుంది. రాష్ట్ర ప్రభుత్వం బొమ్మె చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టబోతోంది. దేశంలోనే తొలిసారి జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)కి చెందిన మంచినీటి చేపల పెంపకం సంస్థ సీఐఎఫ్ఏ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ అక్వా కల్చర్) ఆధ్వర్యంలో బొమ్మె చేపల పెంపకం జరగనుంది.

**బొమ్మె చేపల వృద్ధి లక్ష్యంగా..**

తెలంగాణలో బొమ్మె చేపకు ప్రత్యేక స్థానం ఉంది. పొడవుగా, నునుపుగా ఉండటంతో పాటు అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఈ చేపను 2016లో ప్రభుత్వం రాష్ట్ర చేపగా గుర్తించింది. మత్స్యశాఖ ద్వారా బొమ్మె చేపల వృద్ధిని చేపట్టేందుకు నిర్ణయించింది. ఈచేప జన్యువును లక్నోలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్స్‌లో భద్రపరిచి మరింత అభివృద్ధికి ప్రణాళికలు చేస్తోంది. డిమాండ్‌ను అనుసరించి మార్కెట్‌లో హై బ్రీడ్ చేపలతో పాటు క్యాట్ ఫిష్‌లు విక్రయిస్తున్నా రు. ఈ నేపథ్యంలోనే బొమ్మె చేప పెంపకం, వి ని యోగం పెంచేలా కొత్త ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ప్రతి పాదించగా కేంద్రం సైతం ఆమోదం తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇక్కడ కార్యరూపం దాల్చనుంది. త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

**పెంపకం..సంరక్షణ..ఆపై ఎగుమతి**

ఎల్లంపల్లి జలాశయం వద్ద బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ కేంద్రం ఏర్పాటు జరుగుతోంది. బొమ్మెతో పాటు బురదమట్టలు, పూలమట్టలు, తదితర రకాల చేపల విత్తన కేంద్రం, పెంపకానికి హచరీలు సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు వీటి సంరక్షణ, వ్యాధుల నివారణకు ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలను ప్రభుత్వం ఏటా చేపట్టే చేపల పంపిణీ పథకానికి వినియోగించనున్నారు. ఇక మృగశిరకార్తెలో చేప ప్రసాదానికి కూడా వీటిని విక్రయించనున్నారు. అంతేకాకుండా రాష్ట్ర అవసరాలు తీరాక ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఈ ప్రాంత చేపలను ఎగుమతి చేయనున్నారు. మరోవైపు ఈ కేంద్రం శిక్షణకు ఉపయోగ పడటంతో పాటు చేపలపై విస్తృత స్థాయి పరిశోధనలకు నిలయంగా మారనుంది. ఫిష్‌పాండ్‌లో ఉన్న మిగిలిన 55 ఎకరాల్లో ఆక్వా కల్చర్ ఫాం ఆరు నెలల్లో పూర్తిస్థాయి వినియోగంలోకి రానుంది.

**30 ఎకరాల్లో పెంపకం..**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని గోదావరి నదిపై గల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద ఫిష్‌పాండ్ కోసం 85 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ ద్వారా మత్స్యశాఖకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. 85 ఎకరాల స్థలంలోని 30 ఎకరాల్లో బొమ్మె చేపల పెంపకం కోసం ప్రభుత్వం భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభు త్వ సహకారంతో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ చేపడుతోంది. బొమ్మె చేపల జాతిని కాపాడటంతో పాటు చేపల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రభుత్వం సంకల్పించింది.

**ఆర్థికాభివృద్ధి దిశగా..**

హాజీపూర్‌లో ఫిష్‌పాండ్, బొమ్మె చేపల పెంపకం చేపడుతుండగా ఈ ప్రాంత ప్రజలు ఉపాధి పొందటంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. ఫిష్‌పాండ్‌లో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలతో అర ఎకరం నుంచి ఎకరం ఆపై ఎంత విస్తీర్ణంలోనైనా సొంతంగా చేపల పెంపకం కోసం ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పెంచిన చేపలను ఫిష్‌పాండ్ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ఈ ప్రాంత మత్స్యకారులతో పాటు ప్రతీ ఒక్కరూ చేపల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగనున్నారు. మొత్తంగా చేపల పెంపకంతో హాజీపూర్ మండలంలోని గుడిపేట భవిష్యత్‌లో దేశానికి మార్గదర్శనం కానుంది.

# 'సమగ్ర శిక్ష'లో సమ్మె సైరన్

- డిమాండ్లు నెరవేర్చాలని దీక్షలు
- ఈ నెల 6, 7 తేదీల్లో రిలే నిరసన దీక్షలు
- 9 నుంచి నిరవధిక దీక్షలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2,474 మంది ఉద్యోగులు



గతేడాది సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జిల్లాల వారీగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు

| జిల్లా | ఉద్యోగులు |
|---|---|
| మంచిర్యాల | 596 |
| ఆదిలాబాద్ | 657 |
| నిర్మల్ | 702 |
| కుమురంభీం | 519 |
| మొత్తం | 2,474 |

లక్ష్మణచాంద(నిర్మల్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా నేటి నుంచి సమ్మె చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

**నేటి నుంచి సమ్మె బాటలో...**

ఈనెల 6, 7 తేదీలలో ఆయా జిల్లా కేంద్రాల్లో రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే ఈనెల 9 నుంచి నిరవధిక నిరసన దీక్ష చేపట్టనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 2,474 మంది..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, భవిత కేంద్రాలు, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, యూఆర్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మొత్తం 2,474 మంది పనిచేస్తున్నారు.


**డిమాండ్లు ఇవే...**

1. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేసి పేస్కేల్ అమలు చేయాలి.
2. రీ ఎంగేజ్ విధానం తొలగించాలి.
3. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి.
4. పీటీఐలకు మిగిలిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరి 12 నెలల వేతనం ఇవ్వాలి.
5. జీవిత బీమా, ఆరోగ్య బీమా కింద రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలి.

**గతంలో హామీ ఇచ్చినా...**

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరసన చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేలా చొరవ చూపాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కోరుతున్నారు.

**హామీలు అమలు చేయాలి**



మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరవధిక దీక్షలు చేపట్టాం. తమ ప్రభుత్వం ఏర్పడితే సమస్య పరిష్కరిస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

– గంగాధర్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

# గంజాయి పట్టివేత



వాంకిడి: నిందితుడితో పోలీసులు

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామానికి చెందిన షిండె శ్యాంరావు ఇంట్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1600 గ్రాముల గంజాయిని గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు శ్యాంరావు ఇంట్లో తనిఖీ చేయగా సుమారు రూ.40 వేల విలువైన గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. గంజాయిని సీజ్ చేసి, నిందితున్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేష్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్, దేవేందర్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ శివారులో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. రవీంద్రనగర్ గ్రామానికి చెందిన హరిదాస్ సర్దార్ గంగాపూర్ శివారులోని కాలువ వద్ద గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. గంజాయి విలువ సుమారు రూ.6వేల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు.

# మహిళ దారుణ హత్య

- మంచిర్యాల జిల్లా పాత బెల్లంపల్లిలో ఘటన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లిలో గురువారం ఓ మహిళ దారుణహత్యకు గురైంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో తన భార్య అత్త పక్షాన మాట్లాడిందన్న కోపంతో ఓవ్యక్తి మహిళ ప్రాణాలను బలితీసుకున్నాడు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి మహేష్ ఏదో విషయంలో తన భార్య మౌనికతో గొడవపడ్డాడు. గొడవ తీవ్రతరం కావడంతో కోపోద్రిక్తుడై తన భార్య మౌనికను చితక బాదాడు. దెబ్బలకు తాళలేక ఆమె అరుపులు పెట్టడంతో ఇరుగు పొరుగున నివాసం ఉంటున్న మౌనిక తల్లి బురుస పద్మ, చెల్లెలు బుచ్చమ్మ, చిన్నమ్మ యెండెల కమల (50) వచ్చి మహేష్‌ను వారించారు. కోపోద్రిక్తుడైన మహేష్ దుర్భాషలాడుతూ తన అత్త పద్మ, బుచ్చమ్మను పొగగొట్టంతో చితక బాదాడు. పద్మ తలకు గాయమైంది. కొంతసేపటికి గొడవ సద్దుమణగడంతో కమల, మరో ఇద్దరు మహిళలు నీళ్లు తెచ్చేందుకు బోరువద్దకు వెళ్లగా అప్పటికే కాచుకూర్చొని ఉన్న మహేష్ వారిని తిడుతూ కమలను కిందకు తోసేశాడు. బిందెను తలపై ఎత్తేసి గూన పెంకులతో తలపై బలంగా బాదాడు. అంతటితో ఆగకుండా చాతిపై కాలితో బలంగా తన్నడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. స్థానికులు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారని సీఐ వెల్లడించారు. కాగా ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. ఘటనాస్థలిని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ సందర్శించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు యెండెల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తాళ్ల గురిజాల ఎస్సై తెలిపారు.

# మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ఇసాక్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన పెన్నంవార్ గణేశ్ (47) టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండగా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. రాత్రి భార్య, కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికిలో నుంచి చూడగా కాళ్లు వేలాడుతూ కనిపించడంతో తలుపులు పగులగొట్టి కిందకు దించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా హుటాహుటిన రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### థియేటర్ అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన శ్రీనివాస టాకీస్ అద్దాలు

చెన్నూర్: తమ అభిమాన హీరో సినిమా ప్రదర్శించలేదని థియేటర్‌ను ధ్వంసం చేసిన ఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పుష్ప–2 సినిమాను ప్రదర్శించడం కుదరలేదు. దీంతో చెన్నూర్‌కు చెందిన బజ్జూరి వినయ్, అతన అనుచరులు గేటు తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి అద్దాలు ధ్వంసం చేశారు. థియేటర్ యజమాని కుర్మ మల్లగౌడ్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

### చిరుత కాదు.. పిల్లి



బావిలో ఇండియన్ కేవిట్ పిల్లి

కుభీర్: మండలంలోని హల్దా శివారులో గుమ్ముల సాయినాథ్‌కు చెందిన వ్యవసాయ బావిలో చిరుతపులి మాదిరి ఉన్న జంతువును గమనించి గ్రామానికి చెందిన కూనింటి రామకృష్ణ అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చేసరికి చీకటి పడడంతో సెల్‌ఫోన్ ఆధారంగా అది పులికాదని ఇండియన్ కేవిట్ రకం పిల్లి అని తేల్చి చెప్పారు. గురువారం ఉదయం బీట్ ఆఫీసర్ ఎ.రాజేశ్ వచ్చి బావిలో చూడగా పిల్లి కనిపించలేదు. గ్రామస్తుల సహకారంతో పరిసరాల్లో వెతికించినా కనిపించలేదు. దీంతో ఎవరూ భయపడవద్దని, అది చిరుతకాదు పిల్లి అని, అందరూ యథావిధిగా పనులు చేసుకోవాలని చెప్పారు.

### లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన అన్నదమ్ములు లక్ష్మణ్, పెద్ద పోశెట్టి మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై నిర్మల్‌కు వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై రూరల్ ఎస్సై ముజాహిద్‌ను సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. లారీవారిని ఢీకొట్టలేదని, అదుపుతప్పి కిందపడినట్లు తమకు సమాచారం ఉందన్నారు.

# గొర్రెల మందపై అడవి జంతువుల దాడి



పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి సమీపంలో బుధవారం రాత్రి మేకలు, గొర్రెల మందపై అటవీ జంతువులు దాడికి పాల్పడగా 20కి పైగా మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు గ్రామ సమీపంలోని ప్రాణహిత నది మధ్యలో ఉన్న ద్వీపంలో మేకలు, గొర్రెలను పెంచుతున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి దొడ్డిపై అటవీ జంతువులు దాడికి పాల్పడగా 20కి పైగా మూగ జీవాలు మృతి చెందాయి. దాడి చేసిన సమయంలో భయంతో దూరంగా వెళ్లి దాక్కున్నామని కాపలాగా ఉన్న భీంకరి శంకర్, దండికె బాపు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఘటనా స్థలానికి వెళ్లి బాధితుల నుండి వివరాలు సేకరించారు. అటవీ బీట్ అధికారి ప్రభాకర్ ఘటనా స్థలానికి వెళ్లి పాదముద్రలు సేకరించారు. డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి మాట్లాడుతూ దాడికి పాల్పడింది పులి కాదని స్పష్టం చేశారు.

# కడుపునొప్పి భరించలేక మహిళ ...



అరుణ(ఫైల్)

నర్సాపూర్(జి): కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గాదరి అరుణ (40) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతోంది. బుధవారం సాయంత్రం కడుపునొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందు తాగింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి మేనమామ గుండోల్ల దత్తురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

# మనస్తాపంతో ఒకరు..



రోహిదాస్ (ఫైల్)

బోథ్: మనస్తాపంతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దేవుల్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ రోహిదాస్ (41) ఇటీవల పత్తి పంట విక్రయించాడు. డబ్బులు తన అకౌంట్‌లో జమ అయ్యాయి. అయితే అతనికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో డబ్బులు ఖర్చు పెడతాడన్న ఉద్దేశంతో అతని భార్య రాథోడ్ లక్ష్మి తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. దీంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. దండేపల్లి మండలం నంబాలకు చెందిన సురేందర్ (33) ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలలోని తన సోదరి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కోళ్లవ్యాన్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### అల్పాహారంలో తగ్గిన పరిమాణం



కేకే–5 గని క్యాంటీన్‌లో తూకం వేసిన పూరి

మందమర్రిరూరల్: డ్యూటీ సమయంలో కార్మికులకు అల్పాహారం అందించేందుకు గనిపై నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో సింగరేణి యాజమాన్యం మెనూ ప్రకారం పలు ఐటమ్స్ చేయిస్తుంది. కొంత క్వాంటిటీ నిర్ణయించి రూ.5కే ప్లేట్ (5 పూరీలు) అందిస్తున్నారు. అయితే పరిమాణం తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కోపూరి సుమారు 16 గ్రాముల పైబడి ఉండాల్సి ఉండగా 8 గ్రాములు తగ్గడంతో కార్మికులు ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి అల్పాహారం క్వాంటిటీ పెంచే విధంగా నిధులు సమకూర్చాలని యూనియన్ల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# బ్యాంకర్లు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: బ్యాంకర్లు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కన్సలిటేటివ్ కమిటీ వార్షిక సంస్థలకు రెండో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పేదప్రజలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు రుణాల మంజూరులో ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడి మోసపోకుండా ఖాతాదారులను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఎల్‌బీవో గిమతి, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్పీ ప్రభాకర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, మెప్మా పీడీ సుభాష్, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

# గర్భంలో శిశువు మృతి

- వైద్యురాలి నిర్లక్ష్యమేనని ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృత శిశువు

ఆదిలాబాద్‌టౌన్: ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని పూలే చౌక్ సమీపంలోగల ఓ నర్సింగ్ హోంకు వెళ్లిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందింది. వైద్యురాలి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద–టీ గ్రామానికి చెందిన ఉష్కం వెంకటి భార్య లక్ష్మి మొదటి కాన్పు కోసం బుధవారం నర్సింగ్ హోంకు వచ్చింది. ప్రసవానికి ఇంకా సమయముందని, గురువారం రావాలని వైద్యురాలు సూచించారు. దీంతో గురువారం మధ్యాహ్నం ఆమెకు నొప్పులు రాగా ఆస్పత్రికి వచ్చి వైద్యురాలికి చూపించారు. ఆమెను మొదటి అంతస్తుకు తీసుకెళ్లాలని సిబ్బందికి చెప్పగా వారు ఆమెను నడిపిస్తూ తీసుకెళ్లారు. ఎన్నిసార్లు పిలిచినా వైద్యురాలు ఆమె వద్దకు రాలేదు. ఆమె నొప్పులతో అల్లాడుతుండగా కిందికి పిలిచారు. మళ్లీ నొప్పులతోనే ఆమె కిందికి వచ్చినా పట్టించుకోలేదు. ఆమె సూచన మేరకు పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి స్కానింగ్ తీయించారు. రిపోర్టు పరిశీలించిన వైద్యురాలు గర్భంలో శిశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆమె కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లినైనా కాపాడాలని కాళ్లా.. వేళ్లా పడ్డారు. దీంతో రూ.7వేలు డిపాజిట్ చేస్తే డెలివరీ చేస్తానని వైద్యురాలు చెప్పారు. శిశువు మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తీరును నిరసిస్తూ సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రైవేట్ వైద్యులు అక్కడికి చేరుకున్నారు. దీనిపై సదరు వైద్యురాలిని వివరణ కోరగా స్పందించలేదు.